# దర్గామిట్ట కతలు



# మా నాయిన నీసుబోతోడు!

నీసు లేనిదే మా యింట్లో అది కూరా కాదు.

మేము తినేది అన్నమూ కాదు.

వారానికి ఆరు పగళ్లు ఆరు రాత్రుళ్లు నీసు వొండి ఏడో రోజు ఒక్కపూట కాయగూర వొండితే మా నాయిన మొకం వికారంగా పెట్టి, కోడి కెలికినట్టుగా కెలికి 'యింత నాశినం తిండి జల్మలో తినలేదు గదా' అని కంచాన్ని మా అమ్మ ముందుకు తోసే రకమే గాని యిష్టంగా ఒక్క ముద్దయినా ముట్టే బాపతు గాదు.

మా నాయిన నీసు పిచ్చి చూసీ చూసీ, నీసు లేని రోజు ఆయన ఎవ్వడు తగూలాట మొదలుబెట్టినా ' మీ పట్టెపోళ్ల జాతికి (మా తాతది చేపలాపారం గదా) ఆ రామాయపట్నం ఆడోళ్లే కరెట్టు. ఆ ఊళ్లో పట్టెపోళ్లామెని కట్టుకోకుండా నా పాలబడినావే. అని యాపకమాకడం దేనికి సామీ' అని మా నాయిన నోరు మూయించేది మాఅమ్మ.

కూర సంగతికొస్తే మా నాయినదంతా 'హైతో ఖానా– నైతో సోనా స్టయిలు' (ఉంటే తినడం లాకుంటే పొణుకోవడం ).

ఏ రోజయినా ఆయన యాభై రూపాయలు సంపాదించుకొని వచ్చినాడా యింకయ్యి నీసు డబ్బుల కిందే లెక్క. పొద్దునాక నీసు కూరకీ సాయింత్రమొక నీసు కూరకీ ఆ డబ్బుల్లోని ఆఖరి అణా పైసాని కూడా జమెయ్యాల్సిందే.

మా ఊర్కి అయిదు మైళ్ల దూరంలోనే తుమ్మలపెంట సముద్రం ఉంది కాబట్టి మాకు నీసంటే ప్రదానంగా చేపలకూరే.

పొద్దున ఎనిమిది గెంటల కాణ్ణుంచి మా యీదిలో చేపల బుట్టెత్తుకొని వచ్చే పట్టెపోళ్ల ఆడోళ్లని 'మోవ్! చేపలూ' అని పిలవడంతో మా యింట్లో కూర మొదలుబెడుతుంది మా అమ్మ.

ఇస్కూలుకు పోతా పోతా మా అమ్మ చేపల బేరం చూసినానంటే నాకు బలే కుషీ. యింకా పూట క్యారేజీ మోసుకెళ్లే బాధ నాకుండదు. అన్నం బెల్లు టయానికి మా నాయినమ్మే సాయంగా వచ్చి చేపల కూరతో అన్నం కలిపి నాకు తినిపించేసి పోతుంది.

మా యింట్లో చేపల కూరది చెప్పవలనిగాని రుచిలే.

ఆ విషయంలో మా అమ్మా నాయినమ్మా యిద్దరూ సయ్యంటే సయ్యే. మా అమ్మయితే బొమ్మ గీసినంత శ్రద్దగా చేపలకూర వొండే తరీఖా (పద్దతి)ని ఈ కళ్లతో ఎన్ని సార్లు చూసి ఉంటానో.

బావిగట్టు కాడ చేపలు ముందరేసుకొని, కత్తితో పొలుసులు చెక్కుకొని, పొట్టకోసి లోపలిదంతా శుద్ధం చేసుకొని, మట్టి నట్టిలో గుప్పెడు ఉప్పగల్లు వేసి ఒకటికి నాలుగుసార్లు చేపముక్కల్ని తోముకొని, నీసు వాసన పోయిందని ఖరారు చేసుకున్నాకగాని కూర చేయడానికి పొయ్యి దెగ్గిర కూచునేది కాదు మా అమ్మ. (మట్ట గుడిసె చేపలు తీసుకుంటే మా అమ్మ పని మరీ కష్టం. వాటికి వళ్లంతా జిగట. పొయ్యిలోని బూడిదలో పొర్లించి బావి గట్టు మీద తోమి తోమి శుబ్రం చేయాలి వాటిని).

కూర పొయ్యి మీదకెక్కినాక యింక నా మకాం అణ్ణే. చింతపండు పులుసు పోసినాక బుడగలు బుడగలుగా కూర తొర్లతా ఉంటే నోటి నిండుగా నీళ్లు నింపుకొని కళ్లతోటే కూర తాగేస్తా ఉండేవాణ్ణి.

కూర చేస్తున్నంత సేపు మా అమ్మ పక్కకు కూడా కదలదు. ముక్క బాగా ఉడికిందనుకున్నాక ఒక్క చుక్క ఆముదం వేసి, ఆవిరి దించే ముందు (పక్కింట్లో చేబదులు తెచ్చయినా సరే) గరిటెడు నెయ్యి వేసి, చెమ్సా కూరని అరిచేతిలో రుచి చూసి తృప్తిగా వంట ముగుస్తుంది మా అమ్మ.

సముద్రం చేప ఏదైనా మా అమ్మ చేసేది పులుసే. చీదలు, వంజరాలు, మాగలు, కండ సుదములు...ఒకో దానిదీ చప్పరించాల్సిన రుచి. యివేవీ దొరక్కపోతేనే గతిలాక, హీనానికి పోయి ముల్వాడలన్నా, గుడ్డంగాళ్లన్నా తీసుకుంటుంది మా అమ్మ.( ఈ రెండు ఒళ్లంతా ముళ్లుండే జాతి. కూర చేసినా ముక్క తినాలంటే బలే యాతన)

ఈ సముద్రం చేపల పిచ్చి మా అన్నకీ నాకూ బాగా పట్టి యాడ మేము ఆడుకుంటున్నా చేపల బుట్ట కనిపిస్తే చాలు సక్కా యింటికి పిల్చుకొచ్చేసేవాళ్లం.

ఒక రోజిట్టాగే చేపలామె కనిపిస్తే యింటికి పిలుచుకెళ్లినాను 'రామ్మో' అంటా.

'ఏం చేపలమ్మా అయ్యి' అనడిగింది మా అమ్మ ఆమెను చూసి.

'సొర చేపలు' అంది చేపలామె.

'మా కొద్దులే పో తల్లా' అని, చేపలామె బుట్ట దించక ముందే పంపించేసింది మా అమ్మ.


# దర్గామిట్ట కతలు

నాకు యింత బారెడొచ్చింది కోపం.

వేరుగా మా నాయినమ్మ కాడికెల్లి 'చూడుమా అమ్మా. చేపలొస్తే తీసుకోలేదు' అని కంప్లయింటు చేసినాను.

'ఆ చేపలు మనం తినకూడదు నాయినా. హరాం (నిషిద్ధం)' అని చెప్పింది మా నాయినమ్మ.

నాకు యిచిత్రం వేసింది.



సముద్రం చేప ఏదైనా మా అమ్మ చేసేది పులుసే. చీదలు, వంజరాలు, మాగలు, కండ సుదములు... ఒకో దానిదీ చప్పరించాల్సిన రుచి. ఇవేవీ దొరక్కపోతేనే గతిలాక, హీనానికి పోయి ముల్వాడలన్నా, గుడ్డంగాళ్ళన్నా తీసుకుంటుంది మా అమ్మ.

'ఎందుకుమా....చెప్పమా' అని అడిగితే అప్పుడు మా నాయినమ్మ బలే కత చెప్పింది.

'ఖాజా ఖిసర్ పీరు అని మనకు ఒక పీరు ఉండే వాడంట. ఆయన ఒకరోజు సముద్రం ఒడ్డున కూచొని క్షవరం చేయించుకుంటా ఉంటే సముద్రంలో చేపలు అదే పనిగా ఎగరతా ఉన్నాయంట. తెల్లగా మెరిసిపోతున్న ఆ చేపల్ని చూసి- ఆహా..ఈ చేపలు బలే ఉండాయి కదా – వీటిని తిందాము అని ఖాజా ఖిసర్ పీరు తన చేతిలోని మంగలి కత్తిని ఎత్తి సముద్రంలోకి విసిరినాడంట. అంత మహిమున్నవాడు, పెద్ద పీరు మనల్ని తినడానికి కత్తి విసిరినాడు కదా యింతకన్నా భాగ్యముంటుందా అని సముద్రంలోని ప్రతి చేపా ఆ కత్తిముందు తల వంచి తెగి పడటానికి రెడీ అయ్యిందంట. అయితే ఒక్క పార చేప మాత్రం అస్సలు కేర్ చేయకుండా ఎగిరెగిరి దూకతా ఉందంట. దాంతో ఉగ్రుడయిపోయిన ఖిసర్ పీరు ముసల్మానులు దీనిని తినడం హరాంగా బావించుగాక అని శాపం బెట్టినాడంట' అని చెప్పింది.

(ఆ తర్వాత మా నాయిన్ని అడిగితే పార చేప చర్మం, మూతి–మొప్పలు తక్కిన చేపలకంటే వేరుగా ఉండబట్టి దాన్ని హరాం చేసినారని చెప్పినాడు)

సముద్రం చేపల సెక్షన్ మా అమ్మదయితే, చెరువు చేపల సెక్షనంతా మా నాయినమ్మది. చెరువు చేపల్ని మా నాయినమ్మ వండుతుందిరా నాయినా...వేంచడం, తియ్యగూర, పులుసు. బాంచత్. మూడూ మూడు రఖాలే.

'మంచినీటి చేప తినడానికి నాలిక మీద రాసి పెట్టుండాల్రా నాయినా' అని ఎర్రగా కారంబట్టిన ఒకో ముక్కా మా కంచంలో వడ్డించేది మా నాయినమ్మ.

మా నాయినమ్మ పుణ్యమా అని నాకు మంచి నీటి చేపల పేర్లన్నీ తెలిసినాయి. యినక దండులు, జల్లలు, పాల్గలు, మొయ్యి, మర, బొచ్చలు...జల్లల్లో కూడా చిన్న జల్లల పులుసు దండం పెట్టాల్సిన కూర.

'హైతో ఖావా' రోజు మా యింట్లో ఈ కూరలన్నీ ఉడికితే 'నైతో సోనా' రోజు ఉప్ప చేపలే గతి.

కూర లేనప్పుడల్లా పాత ఫ్యారెక్సు డబ్బాలో ఎత్తి పెట్టుండే ఉప్ప చేప ముక్కల్ని బయిటికి తీస్తుంటుంది మా అమ్మ. వాటికి కాంబినేషను మా నాయినమ్మ చేసే మినప్పచ్చడి. వేడి వేడి అన్నంలో మినప్పచ్చడి కలుపుకొని వేంచిన తాటాకు చేపలో, కచ్చాళ్లో, మెత్తాళ్లో నంజూకుంటా ఉంటే...సొర్గం! (రొయ్య పొట్టు సంగతి సపరేట్‌గా చెప్పాల్నా?)

యింతకీ చేపల కూర గురించి యింత కత ఎందుకు చెప్పినానంటే నా ఆకలికీ చేపల కూరకీ జత కలిపే కత ఒకటుంది.

నాది సామాన్యమైన ఆకలిగాదు.

మా అమ్మ కట్టిచ్చే క్యారేజీని ఇస్కులులో మధ్యానానికి సఫా చేసేసినా థర్డు పిరియడు నుంచి మళ్లీ ఆకలి రేగిపోతా ఉండేది. లాస్టు పిరియడులో 'ఐస్‌బాయ్', 'బజారు బంతి' ఆడుకున్నాక యింకా ఆకలి నన్ను నిలబెట్టేది కాదు.

ఆ సంగతి తెలుసు కాబట్టే మా అమ్మ శేరు నొండినా అర్దశేరు నొండినా కొంత అన్నం తీసి పక్కన పెట్టుండేది సాయంత్రానికి. అది తింటేనే నేను మనిషయ్యేది. లేకపోతే లా.

ఒకరోజు సాయంత్రం యిట్టాగే ఆకలితో నకనకలాడుతా ఇస్కూలు నుంచి వచ్చేటప్పటికి యింట్లో ఒక్క మెతుకు లేదు. దబర ఖాళీ.

అన్నం కానూకిందే గాకుండా నన్నిట్ట నా మానాన వదిలేసి పక్కింట్లో పెత్తనాలు చేస్తా ఉన్న మా అమ్మ మీదా నాయినమ్మ మీదా కడుపు కాలిపోయింది. ఏడుపొచ్చింది.

కోపం వచ్చినప్పుడు, ఏడుపు వచ్చినప్పుడు మా నాయినలాగా బొచ్చెలు పగల్నూకడం అలవాటుగాబట్టి ఏదో ఒక బొచ్చ పగల గొడదామని పొయ్యిమీద దబర తాకా.

చెయి కాలింది.

మూత తెరిచి చూస్తే నాడమ్మ బడవ– చేపల కూర. రాత్రి కోసం అప్పణ్ణే ఒండి పెట్టినట్టుంది. దాన్ని చూడగానే నోట్లో నీళ్లూరాయి. కడుపులో ఆకలిరేగింది.

యింక చూసుకో.

దబర దించి, బాసింమెట్టేసుకొని కూర తాగతా తాగతా... ముక్కలు నొలుస్తా నొలుస్తా...అర్దగంటలో అంతా అవజేసే సరికి మా అమ్మొచ్చేసింది.

నాయినా!

కడుపయితే నిండింది గానీ ఆ తర్వాత మా అమ్మ చేతిలో నేను పడిన పాట్లు ఏమని చెప్పను!

–మహమ్మద్ ఖదీర్‌బాబు